తమ్ముళ్లకే గోకులం షెడ్లు

- జిల్లాలో 850 యూనిట్లు మంజూరు
- ఎక్కువ శాతం వారికే కేటాయింపు
- యూనిట్ సంఖ్యను పెంచాలని పాడి రైతుల డిమాండ్


కొత్తపల్లి మండలం గోకవరం గ్రామంలో నిర్మించిన మినీ గోకులం షెడ్డు

నంద్యాల(రూరల్): గోకులం షెడ్లకు భారీ డిమాండ్ ఏర్పడింది. ఇదే అదునుగా భావించిన కొందరు టీడీపీ నాయకులు తమకు అనుకులంగా ఉన్న కార్యకర్తలకు(పాడిరైతులు) గోకులం యూనిట్లను కట్టబెడుతూ సొమ్ము చేసుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా మినీ గోకులం కింద సబ్సిడీపై షెడ్లను నిర్మించుకోవడానికి జిల్లా పశుసంవర్ధకశాఖ పాడి రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తోంది. గొర్రెలు, మేకలకు సంబంధించి 70 శాతం, కోళ్లకు 70 శాతం , పాడిరైతులకు 90 శాతం రాయితీ దక్కనుంది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ ద్వారా బిల్లులు చెల్లించనున్నారు. ప్రస్తుతం మంజూరైన యూనిట్లు ఏ మాత్రం సరిపోవని, వాటి సంఖ్యను పెంచాలని రైతులు కోరుతున్నారు.

రాయితీ ఇలా..

యూనిట్ ఖరీదులో రైతు వాటా చెల్లించాల్సి ఉంటుంది. వాటిలో రెండు పశువులు ఉన్న యూనిట్ షెడ్‌కు రూ.1,15,000 కాగా రైతు వాటా రూ.11,500 చెల్లించాల్సి ఉంది. నాలుగు పశువులు ఉన్న షెడ్‌కు యూనిట్ ఖరీదు రూ.1,85,000 కాగా రైతు వాటాగా రూ.18,500 చెల్లించాల్సి ఉటుంది. ఆరు పశువులు కంటే ఎక్కువ ఉంటే యూనిట్ ఖరీదు రూ.2,30,000 కాగా అందులో రైతు వాటా రూ.23 వేలు చెల్లించాలి. అలాగే 20 గొర్రెలు, మేకల యూనిట్ ఖరీదు రూ.1,30,000 కాగా అందులో వాటా రూ.39 వేలు, 50 గొర్రెలు దాటితే యూనిట్ ఖరీదు రూ.2,30,000 కాగా అందులో రూ.69 వేలు రైతు వాటా చెల్లించాలి. ఇక 100 కోళ్ల షెడ్ యూనిట్ విలువ రూ.87 వేలు కాగా రైతు వాటా రూ.26,100, అలాగే 200 కోళ్లు అయితే యూనిట్ ఖరీదు రూ.1,32,000 కాగా అందులో రూ.39,600 రైతుల వాటా చెల్లించాలని అధికారులు చెబుతున్నారు.

లబ్ధిదారుల ఎంపిక ఇలా..

గోకుల షెడ్ల నిర్మాణానికి లబ్ధిదారుల ఎంపికకు నిబంధనలు ఉన్నాయి. దరఖాస్తు దారుడికి తన పేరుతో స్థలం ఉండాలి. గ్రామ సభ ద్వారా గ్రామ పంచాయతీ తీర్మానం చేసి ఉండాలి. దరఖాస్తుకు బ్యాంకు, ఆధార్, పాన్ కార్డు జతపరచాలి. ఎస్సీ, ఎస్టీ పేద మహిళలు యజమానులుగా ఉన్న వారికి తొలి ప్రాధాన్యత ఉంటుంది.

లబ్ధిదారులు చిన్న, సన్న కారు రైతులై ఉండాలి. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పొందిన జాబ్ కార్డు తప్పనిసరిగా ఉండాలి.

నియోజకవర్గం	మంజూరైన యూనిట్లు
ఆళ్లగడ్డ	150
బనగానపల్లె	150
నందికొట్కూరు	195
డోన్	100
శ్రీశైలం	105
నంద్యాల	50
పాణ్యం	100
మొత్తం	850

850 యూనిట్లు మంజూరు



జిల్లా వ్యాప్తంగా 850 యూనిట్ల వరకు మినీ గోకులం షెడ్ల నిర్మాణానికి ఉన్నాతాధికారులు అనుమతించారు. జిల్లాలో ఇప్పటి వరకు 1,000 మందికి పైగా పాడిరైతులు దరఖాస్తు చేసుకున్నారు. గోకులం యూనిట్లు పెంచాలని, అర్హులైన రైతులందరికీ ఇవ్వాలని రైతులు కోరారు. ఈ విషయం ఉన్నాతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. మినీ గోకులాల మంజూరులో ఎటువంటి రాజకీయాలు లేవు. అర్హుల ఆధారంగా మంజూరు చేస్తున్నాం. – **గోవింద్ నాయక్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి,నంద్యాల**

అర్హులందరికీ మంజూరు చేయాలి



రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి పాడి రైతులకు మినీ గోకులం షెడ్లు మంజూరు చేయాలి. ప్రస్తుతం సబ్సిడీ ద్వారా రైతులకు ఏర్పాటు చేస్తున్న ఈ షెడ్లు పశువులకు చాలా ఉపయోగపడుతున్నాయి. ప్రతి గ్రామంలో గ్రామ సభల ద్వారా కాకుండా గ్రామ పశువైద్యాధికారి ఆధ్వర్యంలో మినీ గోకులాలు నిర్మించాలి.

– **సుధాకర్‌రెడ్డి, బానకచర్ల గ్రామం, పాములపాడు మండలం**

అవగాహన కల్పించాలి



ప్రభుత్వం అధిక సబ్సిడీతో పాడిరైతులకు ఏర్పాటు చేస్తున్న ఈ మినీ గోకుల షెడ్ల గురించి చాలా మంది పాడిరైతులకు తెలియదు. సంబంధిత అధికారులు రైతులకు గ్రామాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి అవగాహన కల్పించాలి. గ్రామీణ స్థాయిలో ఇప్పటికీ మినీగోకులం షెడ్ల గురించి తెలియక చిన్న చిన్న పాకలలో పశువులను ఉంచుతున్నాం.

– **ఇస్సాక్, ఎం.లింగాపురం, కొత్తపల్లె మండలం**

జాబితాలో తెలుగు తమ్ముళ్లే అధికం..

జిల్లా వ్యాప్తంగా మంజూరైనా 850 మినీ గోకులం యూనిట్లలో ఎక్కువ మంది తెలుగుదేశం పార్టీకి చెందిన వారు ఉండటం పట్ల అనేక విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా ఈ మినీ గోకులానికి దరఖాస్తు చేసుకోవాలంటే ముందుగా గ్రామ సభలో ఆమోదం పొందాలనే నిబంధన అమలు చేయడంతో గ్రామ స్థాయి టీడీపీ నాయకులు వారి అనుచరులకు మాత్రమే ఈ మినీ గోకులాలు అమలు అయ్యేలా వారి ప్రజాప్రతినిధుల నుంచి అధికారులపై ఒత్తిడి పెంచడంతో దరఖాస్తు చేసుకున్న మిగతా రైతులు అయోమయంలో పడ్డారు.

క్లుప్తంగా

ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించిన శివమల్లేశ్వరప్ప



శిరివెళ్ల: మండల నూతన ఎంపీడీఓగా శివమల్లేరప్ప శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వర్తించే ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం ఆత్మకూరుకు బదిలీ అయిన విషయం తెలిసిందే. అలాగే వీరారెడ్డి పల్లె గ్రామ పంచాయతీ కార్యదర్శిగా ఝాన్సీ, స్థానిక 4వ గ్రామ సచివాలయ కార్యదర్శిగా వీణాకుమారి బాధ్యతలను స్వీకరించారు.

రీ సర్వే డీటీగా మహబూబ్‌బాషా....

మండల నూతన రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్‌గా మహబూబ్‌బాషా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అలాగే యర్రగుంట్ల రెండవ గ్రామ సచివాలయ వీఆర్వోగా హసీనా చాగలమర్రి నేలంపాడు నుంచి బదిలీపై వచ్చారు.

రుద్రవరం ఎంపీడీఓగా భాగ్యలక్ష్మి


రుద్రవరం ఎంపీడీఓను అభినందిస్తున్న ఉద్యోగులు

రుద్రవరం: రుద్రవరం ఎంపీడీఓగా భాగ్యలక్ష్మి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఈఓపీఆర్డీగా విధులు నిర్వహించిన ఈమె పదోన్నతిపై బదిలీ అయ్యారు. ప్రస్తుత బదిలీల్లో ఆమె రుద్రవరం ఎంపీడీఓగా వచ్చారు. మండల పరిషత్ ఉద్యోగులతో పాటు పంచాయతీల కార్యదర్శులు,శాలువా. పూలమాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. అలాగే మండల పరిషత్ ఏఓగా కొత్తపల్లి నుంచి సుబ్రహ్మణ్యం, జూనియర్ అసిస్టెంట్‌గా చాగలమర్రి నుంచి బదిలీ అయిన హరికిషన్ బాధ్యతలు స్వీకరించారు.

చాగలమర్రి ఎంపీడిఓగా మంజులవాణి



చాగలమర్రి: చాగలమర్రి ఎంపీడిఓగా మంజులవాణి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా ఆమె జూపాడుబంగ్లా నుంచి ఇక్కడికి వచ్చారు. ఈఓపీఆర్డీ తాహీర్ హుసేన్‌తో పాటు ఉద్యోగులు, సిబ్బంది ఆమెను కలిసి అభినందనలు తెలిపారు.

సిబ్బంది సమస్యలు పరిష్కరిస్తాం


సిబ్బంది సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ


బొమ్మలసత్రం: పోలీస్‌శాఖలో పనిచేస్తూ ఏవైనా ఇబ్బందులు ఉంటే వాటి పరిష్కారం కోసమే ప్రతి శుక్రవారం గ్రీవెన్స్‌డే నిర్వహిస్తున్నామని ఎస్పీ అదిరాజ్‌సింగ్‌రాణా తెలిపారు. స్థానిక కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో పనిచేస్తున్న ఆరుగురు సిబ్బంది మ్యూచువల్, రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్‌పై తమను ఆశ్రయించారన్నారు. వారికి త్వరలో పరిష్కారం చూపుతామని వివరించారు.

పొంగిన వాగులు వంకలు


ఏడుగాండ్లమోరి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వర్షపునీరు

దొర్నిపాడు:మండలంలో శుక్రవారం తెల్లవారు జామున భారీ వర్షం కురిసింది. దీంతో వాగులు వంకలు పొంగిపొర్లాయి. 12.2మి.మీ వర్షపాతం నమోదు అయినట్లు తహసీల్దార్ సుభద్ర తెలిపారు. రబీలో భాగంగా మాతృపంటగా సాగుచేయనున్న పప్పుశనగ సాగుకు ఈవర్షం ఉపయోగ పడుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పటికే రసాయన ఎరువులు భూమిలో విత్తిన విషయం తెలిసిందే.

7లోపు ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలి


మాట్లాడుతున్న బాలాజీనాయక్

నంద్యాల(అర్బన్): ఈనెల 7వ తేదీలోపు ఈ-కేవైసీ పూర్తిచేసుకోవాలని ఏడీఏ రాజశేఖర్ సూచించారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం వీఏఏ, వీహెచ్ఏ, ఎంపీఈఓలకు నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు వెంకట రవణమ్మ, బాలాజీ నాయక్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ఈ-పంట నమోదు చేసుకున్న రైతులు ఈకేవైసీ చేసుకోవాలన్నారు. శాస్త్రవేత్త బాలాజీనాయక్ మాట్లాడుతూ వరి, మినుము పంటల్లో ఆశించిన పురుగులను నివారించుకుంటేనే దిగుబడులు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఓ ప్రసాదరావు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జడ్జి శైలజ

రుద్రవరం: మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఆళ్లగడ్డ సీనియర్ సివిల్ జడ్జి శైలజ అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో శుక్రవారం విధాన్ సే సమాధాన్ కార్యక్రమంలో భాగంగా మహిళలకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీఓ తేజేశ్వరీ, రిసోర్స్ పర్సన్స్ రమదేవి, విజయ్ తదితరులతో కలిసి జడ్జి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం జడ్జి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించడంతో పాటు చట్టాలను తెలుసుకోవాలన్నారు. మహిళలకు ప్రత్యేకంగా ఉచిత న్యాయ సలహాదా రులు ఉన్నారని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

జిల్లా అభివృద్ధికి ప్రణాళికలు రూపకల్పన

- జిల్లా కలెక్టర్ రాజకుమారి


మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల(అర్బన్): స్వర్ణాంధ్ర – 2047 ప్రణాళికలో భాగంగా రాబోయే 23 ఏళ్లలో నంద్యాల జిల్లా అన్ని రంగాలలో అభివృద్ధి సాధించే దిశగా ప్రణాళికలు రూపకల్పన చేస్తున్నామని కలెక్టర్ రాజకుమారి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్లోని సెంటనరీ హాలులో స్వర్ణాంధ్ర – 2047 జిల్లా దార్శనిక పత్ర ప్రణాళికపై అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, వివిధ రంగాల స్టేక్ హోల్డర్స్‌లతో జిల్లా స్థాయి సమీక్ష నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్, డీఆర్ఓ పద్మజ, సీపీఓ వేణుగోపాల్, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 60 వేల మందికి పైగా క్యూఆర్ కోడ్ స్కాన్ ద్వారా తమ అభిప్రాయాలు పొందుపరిచారన్నారు. జిల్లాలో 6 ప్రముఖ సిమెంట్ పరిశ్రమలు ఉన్నాయని దీంతో పాటు పారిశ్రామిక రంగాన్ని మరింత అభివృద్ధి చేస్తే జిల్లా జీడీపీ పెరుగుతుందన్నారు. సహజంగా లభించే వనరులు అయిన సోలార్, విండ్, వాటర్ తదితర సమీకృత వనరులతో వృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో 70 శాతం అక్షరాస్యత మాత్రమే ఉందని ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందడంతో పాటు ఉన్న వనరులను చక్కగా సద్వినియోగం చేసుకోవాలన్నారు.

చెంచుగూడేల్లో మౌలిక వసతులు కల్పించాలి


కలెక్టర్‌కు బొకే అందజేస్తున్న శంకర్‌నాయక్

నంద్యాల(అర్బన్): శ్రీశైలం ఐటీడీఏ పరిధిలోని చెంచు గూడేల్లో మౌలిక వసతులు కల్పించి వారి అభివృద్ధికి కృషి చేయాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్‌నాయక్ కలెక్టర్ రాజకుమారిని కోరారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన శుక్రవారం కలెక్టర్‌ను కలిసి గిరిజన సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఆశ్రమ గురుకులాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యాబోధన అందించేందుకు రెగ్యులర్ టీచర్లను నియమించాలని, వారి ఆరోగ్య భద్రతపై ఏఎన్ఎంలను ఏర్పాటు చేయాలని కోరారు. ప్రతి గిరిజన తండాకు శ్మశాన వాటిక, విద్యుత్ సౌకర్యం కల్పించాలని, ఆధార్, రేషన్ కార్డులు లేని వారికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. ఆయన వెంట నాయకులు రాజునాయక్, రవినాయక్, శ్రీనివాసులు నాయక్ ఉన్నారు.

సులభంగా దరఖాస్తు చేసుకోవచ్చు

బొమ్మలసత్రం: మద్యం దుకాణాల అనుమతులకు దరఖాస్తు చేసుకోవటం ఎంతో సులభమైన ప్రక్రియ అని ఉమ్మడి జిల్లాల ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి అన్నారు. శుక్రవారం స్థానిక ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. 2024 నూతన మద్యం పాలసీ ప్రకారం మద్యం దుకాణాలు దక్కించుకునే వారు దరఖాస్తు చేసుకునేందుకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్, హైబ్రీడ్ పద్ధతుల ద్వారా అవకాశం కల్పించామన్నారు. తేలికపాటి ధ్రువపత్రాలను చూపుతూ కేవలం రూ.2 లక్షల చెల్లింపుతో ఎంట్రీపాస్ తీసుకోవచ్చన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోలేని వారు స్టేషన్ వద్దకు వచ్చి కేవలం నిమిషాల వ్యవధిలో న్‌లైన్‌లో సిబ్బంది నమోదు చేస్తారన్నారు. కర్నూలు జిల్లాలో మొత్తం 99 దుకాణాలు, నంద్యాల జిల్లాలో 105 దుకాణాలకు లైసెన్స్ ఇవ్వనున్నామన్నారు. ఉమ్మడి జిల్లాల నుంచి ఇప్పటికీ సుమారు 200 పైగా దరఖాస్తు చేసుకున్నారన్నారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా సూపరింటెండెంట్ రవికుమార్, సీఐ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఉద్యమ అధ్యయన తరగతులను విజయవంతం చేయండి

నంద్యాల (న్యూటౌన్): ఉద్యమ అధ్యయన తరగతులను విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు రామచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి పాండురంగ వరప్రసాద్ సూచించారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఈనెల 6న స్థానిక నేషనల్ పీజీ కళాశాలలో ఉద్యమ అధ్యయన తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

8న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

నంద్యాల(న్యూటౌన్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 8న స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు స్కిల్ డెవలెప్‌మెంట్ జిల్లా అధికారి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం జాబ్ మేళా కరప్రతాలను ప్లెస్‌మెంట్ ఆఫీసర్ సుబ్బన్న, కోఆర్డినేటర్ మస్తానువలితో కలిసి ఆవిష్కరించారు.

ఇద్దరిపై దాడి

బొమ్మలసత్రం: నగదు డిమాండ్ చేయటంతో నిరాకరించిన వ్యక్తిపై దాడిచేసిన సంఘటన శుక్రవారం పట్టణ శివారులో చోటుచేసుకుంది. తాలుకా సీఐ ఇస్రార్‌బాషా తెలిపిన వివరాలు.. విశ్వనగర్ వీధికి చెందిన చాకలి మద్దిలేటి తన స్నేహితుడు శ్రీనుతో కలిసి పనినిమిత్తం బైక్‌పై పెద్దకొట్టాల గ్రామానికి బయలుదేరారు. దారి మధ్యలో వైఎస్సార్‌నగర్‌కు చెందిన లక్ష్మీదేవి అనే మహిళతోపాటు అశోక్ అనే యువకుడు బైక్‌ను అటకాయించి రూ.500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. డబ్బు ఎందుకు ఇవ్వాలని మద్దిలేటి, శ్రీను ప్రశ్నించటంతో లక్ష్మీదేవి, అశోక్ మరి కొంత మంది కర్రలతో దాడి చేశారు. గాయపడిన వారిని స్థానికులు నంద్యాల జీజీహెచ్‌కు తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

భగ్గుమన్న 'సంత'


క్రిష్టిపాడులో నిర్వహిస్తున్న కూరగాయల సంత

దొర్నిపాడు: కూరగాయల ధరలు మండిపోతున్నాయి. కూరగాయలు రోజురోజు సామాన్యులకు అందుబాటులో లేకుండ పోతున్నాయి. రూ.500 తీసుక పోతేగానీ సంచి నిండే పరిస్థితి లేదు. టమాట కిలో రూ.100 దాటడంతో ఇక చింతపండే నయం అనుకుంటున్నారు. అలాగే ఉల్లిగడ్డలు కొంతకాలంగా కిలో రూ.50కి ఏమాత్రం తగ్గకుండా కన్నీరు తెప్పిస్తునాయి. పచ్చిమిర్చి అంటరా రైతుల వద్ద మాత్రం రూ.10 ఉంటే మార్కెట్లో ఏకంగా రూ.40 అంటూ ఘాటెక్కుతుది. ఇక వంకాయ, బంగాళదుంప, క్యారెట్, బీన్స్, క్యాప్సికం, కాకరకాయలు కిలో రూ.40నుంచి రూ.60 పైమాటే. దీంతో కొనలేం.. తినలేం అంటూ సామాన్యుడు నిట్టూర్చుతున్నాడు.

బాధ్యతల స్వీకరణ

దొర్నిపాడు: మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో శుక్రవారం పలువురు అధికారుల బాధ్యతలు స్వీకరించారు. ఈఓపీఆర్డీగా సులోచన బాధ్యతలు స్వీకరించారు. ఈమె పత్తికొండ మండలం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. శిరివెళ్ల మండలం నుంచి వచ్చిన నారాయణమూర్తి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా, శ్రీశైలం నుంచి వచ్చిన వెంకటరెడ్డి పంచాయతీరాజ్ ఏఈగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులు నాగర్జున, మధు, ఓబులేసు, బ్రహ్మానందరెడ్డి ఈఓపీఆర్డీ సులోచనను కలిసి అభినందనలు తెలిపారు.

రాయితీ విత్తనాలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

దొర్నిపాడు: రబీలో సాగుచేయనున్న శనగ సాగుకు మండలానికి 677 క్వింటాళ్ల శనగ విత్తనాలు మంజూరు అయినట్లు ఏఓ సునీత శుక్రవారం తెలిపారు. బుర్రారెడ్డిపల్లెకు 60 క్వింటాళ్లు, చాకరాజువేములకు 90, దొర్నిపాడు–1కు 95, దొర్నిపాడు 2కు 75, గుండుపాపల 80, క్రిష్టిపాడు 130, డబ్ల్యూ గోవిందిన్నె 117, డబ్ల్యూ కొత్తపల్లెకు 30 క్వింటాళ్లు కేటాయించినట్లు చెప్పారు. క్వింటాం ధర రూ. 9,400 ఉండగా 25 శాతం రాయితీ పోనూ రూ.7,050 రైతులు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

పీఆర్ ఏఈగా వెంకటయ్య

ఉయ్యాలవాడ : మండల పరిషత్ పంచాయతీరాజ్ ఏఈగా వెంకటయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఏఈ రామక్రిష్టారెడ్డి నంద్యాలకు బదిలీ కావడంతో ఆయన స్థానంలో బండి ఆత్మకూరు ఏఈ వెంకటయ్యను ఉన్నతాధికారులు నియమించారు. అదేవిధంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కార్యదర్శులు విధుల్లో చేరారు. పి. సుమిత్ర కొండుపల్లె కార్యదర్శిగా, మాలతి – ఇంజేడు, వెంకటేశ్వర్లు –తుడుమలదిన్నె, చిన్న హుసేని – పుచ్చకాయలపల్లె, విజయదీప్తి – సుద్దమల్ల, సతీష్‌కుమార్ – కాకరవాడ, రవి ప్రకాష్‌రెడ్డి – సర్వాయిపల్లె, రాజశేఖర్‌బాబు – పెద్దయమ్మనూరు కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించారు. అలాగే లక్ష్మి చెన్నప్ప ఆర్.జంబులదిన్నె సచివాలయం వీఆర్‌ఓగా బాధ్యతలు చేపట్టారని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు తెలిపారు.

7వ తేదీ నుంచి స్పాట్ అడ్మిషన్లు

ఆళ్లగడ్డ: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న సీట్లను స్పాట్ అడ్మిషన్ల కింద భర్తీ చేసుకోవడం జరుగుతుందని ప్రిన్సిపల్ శివరామయ్య తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 7వ తేదీ నుంచి 12వ తేదీ లోపు కళాశాలకు దగ్గరకు వచ్చి ఆన్‌లైన్‌లో అడ్మిషన్లు పొందవచ్చని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురి గాయాలు


ఆళ్లగడ్డ: పట్టణ శివారులోని గూబగుండం మెట్ట సమీపంలో శుక్రవారం జరగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. చింతకుంట గ్రామానికి చెందిన హరికృష్టారెడ్డి మరో ఇద్దరు కుటుంబ సభ్యులతో కలిసి నంద్యాల నుంచి ఆళ్లగడ్డకు కారులో వస్తుండగా గూబగుండం మెట్ట సమీపంలో టైరు పగిలింది. ఈ ప్రమాదంలో హరికృష్టారెడ్డితోపాటు మరో ఇద్దరు గాయపడగా స్థానిక వైద్యశాలకు తరలించారు.

సావిత్రిదేవి అలంకారంలో అమ్మవారు


చాగలమర్రి: సావిత్రిదేవిగా అమ్మవారు


ముత్యాలపాడులో భవానిదేవిగా...


దొర్నిపాడు: అన్నపూర్ణ దేవిగా వాసవీ మాత


ఆళ్లగడ్డ: అన్నపూర్ణదేవీ అలంకరణలో అమ్మవారు

చాగలమర్రి: మండల కేంద్రం చాగలమర్రి గ్రామంలో వెలసిన మత్కన్యకాపరమేశ్వరీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం సావిత్రిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చింది. ప్రత్యేక పూజల అనంతరం అమ్మవారికి పల్లకీ సేవ నిర్వహించారు. కార్యక్రమాలకు శాశ్వత ఉభయదారులు మదళ్ళపల్లె శివరామప్రసాద్, లక్ష్మీనారాయణ, నరసింహ్మారావు కుటుంబ సభ్యులు వ్యవహరించినట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వంకదార లక్ష్మణబాబు తెలిపారు. ముత్యాలపాడు గ్రామంలో వెలసిన శ్రీమత్కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా రెండవ రోజు శుక్రవారం రాత్రి శ్రీభవానిదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చింది. కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ పాలకవర్గ ఉపాధ్యక్షులు మల్లికార్జున, సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, ఉప కార్యదర్శి జ్వాలా నర్సింహ్మయ్య, కోశాధికారి కూరపాటి రామకృష్ణ వరప్రసాద్, ఉప కోశాధికారి సుంకు జగదీష్, దర్మకర్త క్రిష్ణం శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దొర్నిపాడు: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా వాసవీమాత శుక్రవారం అన్నపూర్ణదేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయదారులు జయచంద్రమోహన్ దంపతులు వ్యవహరించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు అంజనీ ప్రసన్న కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆళ్లగడ్డ: అమ్మలుగన్న అమ్మ... పాహిమాం అంటూ భక్తులు అమ్మవారిని వేడుకుంటున్నారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీమత్కన్యకా పరమేశ్వరీ దేవీ అమ్మవారు అన్నపూర్ణదేవి అలంకరణలో భక్తులను కనువిందు చేశారు. తెల్లవారు జామునుంచే అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం సర్వతోభద్ర హోమం, కుంకుమ పూజలు నిర్వహించారు.


శిరివెళ్ల: వరలక్ష్మీదేవిగా అమ్మవారు


ఉయ్యాలవాడ : గాయత్రి దేవిగా అమ్మవారు


రుద్రవరం: గాయత్రీదేవి అలంకారంలో అమ్మవారు

శిరివెళ్ల: మండలంలోని శిరివెళ్ల, వీరారెడ్డిపల్లె, యర్రగుంట్లలో శుక్రవారం దేవీ శరన్నవరాత్రోత్సవాలు అత్యంత వైభంగా జరిగాయి. స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు వరలక్ష్మీ దేవీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పూజారి కేశవ శర్మ అమ్మవారికి శేగు వెంకట సుబ్బయ్య, కర్నాటి చంద్రశేఖర్ దంపతులచే విశేష పూజలు చేయించారు.

ఉయ్యాలవాడ : మండలంలో దసరా శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా ఇంజేడు గ్రామంలో చౌడేశ్వరి దేవి గాయత్రి అలంకారంలో, మండల కేంద్రమైన ఉయ్యాలవాడలో మారెమ్మ గాయత్రి దేవి అలంకారంలో శుక్రవారం భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవార్లను భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

రుద్రవరం: దసరా ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక కన్యకా పరమేశ్వరీ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు చోళవేటి సూర్యనారాయణ ఆధ్వర్యంలో వేదపండితులు అమ్మవారిని గాయత్రీ దేవిగా అలంకరించి భక్తులకు దర్శణం కల్పించారు.

కురిసిన వర్షం-తడిసిన మొక్క జొన్నలు


తడిసిన మొక్క జొన్నలను మరో చోటికి తరలిస్తున్న దృశ్యం

రుద్రవరం: మండలంలో గురువారం రాత్రి ఉన్న ఫలంగా భారీ గాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో ఆరబోసిన మొక్క జొన్న దిగుబడులు తడిసి పోయాయి. కొన్నిరోజుల నుంచి మొక్క కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ మేరకు మొక్క జొన్న దిగుబడులను రైతులు కల్లాలు, రోడ్లు, బయలు ప్రదేశాల్లో అరబెట్టుకుంటున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆరబెట్టి కుప్పలుగా చేసి పట్టాలు కప్పుతారు. అయితే గురువారం చీకటి పడిన కొద్ది సేపటికే వర్షం కురవడంతో మొక్కజొన్న దిగుబడులు తడిసిపోయాయి. శుక్రవారం ఉదయం తడిసిన మొక్క జొన్న దిగుబడులను చూసిన రైతులు నిరాశకు గురయ్యారు. వెంటనే ట్రాక్టర్లతో దిగుబడులను తరలించి మరో ప్రదేశంలో ఎండబెట్టుకున్నారు. గింజలు రంగు మారతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

అహోబిల క్షేత్రం దుకాణాల వేలం పాటలు

ఆళ్లగడ్డ: ప్రముఖ పుణ్యక్షేత్రం అహోబిలం లక్ష్మి నరసింహాస్వామి ఆలయానికి సంబంధించిన దుకాణాల వేలం పాటలను శుక్రవారం మఠం మేనేజర్ మాధవన్ ఆధ్వర్యంలో టీటీడీ స్వాతి వైద్యశాల ఆవరణలో నిర్వహించారు. టెంకాయల దుకాణాల నిర్వహణకు రూ.30లక్షలకు వేలం పాడారు. అలాగే తలనీలాల సేకరణకు వేలం పాట నిర్వహించగా ఎవ్వరూ ముందుకు రాకపోవడంతో వాయిదా వేశారు. పోలీసుల బందోబస్తు మధ్య వలేం పాటలు నిర్వహించారు.

వన్య ప్రాణుల సంరక్షణకు కృషి చేయాలి

రుద్రవరం: ప్రతిఒక్కరూ వన్య ప్రాణుల సంరక్షణకు కృషి చేయాలని ఫారెస్ట్ అధికారులు శ్రీనివాసరెడ్డి, రాణెమ్మ సూచించారు. వన్య ప్రాణి వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం వారు మండల పరిధిలోని హరినగరంలో గూడెం వాసులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు అడవి జంతువులను వేటాడటం మానుకోవాలని చెప్పారు. అటవీ సరిహద్దుల్లో వాహనాలను అతి వేగంగా నడపవద్దని, రోడ్లపై ఎక్కడ బడితే అక్కడ ఆహార పదార్థాలు వేయవద్దన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌బీఓలు సురేంద్రగౌడ్,న రసింహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వన్య ప్రాణుల సంరక్షణ మనందరి బాధ్యత

చాగలమర్రి: వన్య ప్రాణుల సంరక్షణ మనందరి బాధ్యతని డి.వనిపెంట సెక్షన్ అటవీశాఖ అధికారి టి.రామకృష్ణ పేర్కొన్నారు. వన్య ప్రాణి సంరక్షణ వారోత్సవాలలో భాగంగా శుక్రవారం ముత్యాలపాడు గ్రామంలోని ఎస్‌పీజీ ఉన్నత పాఠశాలలో ఆయన అవగాహన కార్యిక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన్య ప్రాణుల సంరక్షణ చట్టం 1972 ప్రకారం వాటిని వేటాడడం నేరమన్నారు. కార్యక్రమంలో స్థానిక బీట్ ఆఫీసర్లు శ్రీమదన్ గోపాల్, శ్రీజంగం శుభాష్ , బేస్ క్యాంపు ప్రొటెక్షన్ వాచర్ నరసింహ, చెంచుగూడెం గ్రామ ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.